నాగుల పంచమి.. భక్తితో కొలిచితిమి.!


చాదర్‌ఘాట్ రేణుకాఎల్లమ్మ దేవాలయంలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

నాగుల పంచమి పూజలను శుక్రవారం అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగదేవత ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. సీపీఎల్ రోడ్డు, చాదర్‌ఘాట్ రేణుకాఎల్లమ్మ దేవాలయం వద్ద ఉన్న పుట్టకు మహిళలు పూజలు చేశారు. గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ పీపుల్స్ పార్కులోని రేణుకాఎల్లమ్మ, నాగదేవత ఆలయంలో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ దంపతులు పూజలు చేశారు. ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయ ప్రాంగణంలో ఉన్న నాగదేవత ఆలయంలో మహిళలు పూజలు చేశారు. గంగపుత్ర కాలనీలోని నాగదేవత ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారిని బీఆర్ఎస్ నేత ముఠా జైసింహ దర్శించుకున్నారు.

– అంబర్‌పేట/చిక్కడపల్లి/ముషీరాబాద్


బాగ్ అంబర్‌పేటలో నాగుల పంచమి పూజలో కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి


ముషీరాబాద్‌లో నాగదేవత పూజలో బీసీ సంక్షేమ సంఘం నేత కళావతి


వివేక్‌నగర్ పీపుల్స్‌పార్క్‌లో రేణుకాఎల్లమ్మ, నాగదేవత ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ పావని దంపతులు, భక్తులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయూతనివ్వాలి

ముషీరాబాద్: ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను చీదరించుకోకుండా చేరదీసి చేయూతనివ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షణ, అలింకో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచిత పరికరాల పంపిణీకి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 150 మందికి పరీక్షలు నిర్వహించామని అందులో అవసరమైన వారికి వీల్ చైర్‌లు, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్స్ తదితర పరికరాల త్వరలో పంపిణీ చేస్తామని రోహిణి తెలిపారు. 6 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు ఈ పరికరాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ మగ్రశిక్షణ కో–ఆర్డినేటర్ ఖనీజ్ ఫాతిమా, ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటీ ఐవోఎస్‌లు స్వరూపారాణి, జయలక్ష్మి, జిల్లా ప్రత్యేక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మల్లేషగౌడ్, నాయకులు ప్రవీణ్‌కుమార్, పాషా, విజయలక్ష్మి, సత్యనారాయణ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అవసరాలు పిల్లలను పరీక్షిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి

దళిత హక్కులు.. మానవ హక్కులే.!

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళిత హక్కులు.. మానవ హక్కులే.. అని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన శ్రామిక యూనియన్, తెలంగాణ రాష్ట్ర సిటిజన్స్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ప్రజ్వల సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ పి.ఆనంద్, డీబీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి నర్సింహ, డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ పి.శంకర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం రూల్స్–18 ప్రకారం ప్రతి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయాల్సిన అవసరం ఉందన్నారు.

◆ ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి ఇచ్చిన నివేదిక, నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో అందించిన వివరాలు, సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచార నివేదికను వారు విడుదల చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారులు పెరిగిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు ఏడు రోజుల్లో రిలీఫ్ అందించాల్సి ఉండగా ఎక్కడ అమలు కావడం లేదన్నారు. అట్రాసిటీ బాధితులకు న్యాయ సహాయం కూడా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, సి.ఆనంద్, స్వరూప, జె.రమేష్, శ్రీనివాస్, అమృత, వెంకటయ్య, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమాచర హక్కు చట్టం ద్వారా సేకరించిన నివేదికను విడుదల చేస్తున్న దృశ్యం

గురుకుల పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పోడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలుగు సంక్షేమ భవన్‌లో బీసీ గురుకులాల కార్యదర్శి బి.సైదులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80 శాతం గురుకులాలకు పక్కా భవనాలు లేవన్నారు. తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గురుకులాలలో చదువుతున్న విద్యార్థులకు ఇంత వరకు సబ్జెక్టుల వారీగా పుస్తకాలు, దుస్తులు, ట్రంకు పెట్టెలు, కాస్మొటిక్స్ వస్తువులు, దుప్పట్లు, దదోమల తెరలు సకాలంలో అందించాలన్నారు. ప్రత్యేకించి బాలికల గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గురుకులాల్లో చేపట్టిన అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయానల్నారు. గురుకుల క్యాంటీన్‌లలో తరచూ ఫుడ్ సెక్యూరిటీ అధికారులు తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌సీఓలు, జిల్లా ఇన్‌చార్జ్‌లు అన్ని వేళలా విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు డి.ప్రణయ్, మంద నవీన్, మాదరపు నాగరాజు, తీగల శ్యామ్, ఝాన్సీ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.


బీసీ గురుకులాల కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను తక్షణమే చేపట్టాలి

- గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ వివేక్ వినాయక్
- రాష్ట్రంలో ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్

కవాడిగూడ: రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని గిరిజన ఐక్య వేదిక తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ వివేక్ వినాయక్, ప్రధాన కార్యదర్శి సోయం ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ హక్కుల దినోత్సవం సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురం భీమ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివేక్ వినాయక్ మాట్లాడుతూ.... సుప్రీం కోర్టు ఎస్సీ రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఎస్టీ రిజర్వేషన్లు కూడా వర్గీకరించాలని కోరారు. రాష్ట్రంలో తక్షణమే ఎస్టీ కమిషన్ ఏర్పాటు, జీవో నం.3ను అమలు చేసి ఆదివాసీలకు ఆర్థిక చేయూతను అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక ఆదివాసీ జిల్లాలను ఏర్పాటు చేయాలని, ప్రతి ఆదివాసీకి 5 ఎకరాల భూమిని పంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గిరిజనుల స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు సోయం గోవర్ధన్, ఆత్రం సాయి, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, నాయకులు జ్ఞానేశ్వర్, కిషన్, విగ్నేష్, సాయి, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురం భీమ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గిరిజన ఐక్యవేదిక నేతలు

లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఆదివాసీ హక్కుల దినోత్సవం

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఆలిండియా బంజారా సేవా సంఘ్ అధ్యక్షుడు సబావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... 45లక్షల మంది జనాభా ఉన్న లంబాడీలు రాజకీయంగా వెనకబడి ఉన్నారని అన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఒక్క లంబాడీ సామాజికవర్గానికి చెందిన మంత్రి లేకపోవడం బాధాకరమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని లంబాడీలకు మంత్రి పదవితో పాటు నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లైంగిక హింసకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంధ బాలికల హాస్టళ్లపై ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలు రూపొందించాలని సామాజికవేత్త సజయ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా ట్రాన్స్‌జెండర్స్ సంఘాల ఐక్య కార్యచరణ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సజయ మాట్లాడుతూ... మలక్‌పేట్‌లోని బీ–బ్లాక్‌లో ఉన్న అంధ బాలికల హాస్టల్‌ను జూన్ 7వ తేదీన ఏడేళ్ల చిన్నారిపై జరిగిన లైంగిక హింస అత్యంత దారుణమైందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

◆ **గర్ల్స్ హాస్టళ్లలో అబ్బాయిలను పెట్టే వ్యవస్థ ఎందుకు?**

బాలికల గొంతు ఎత్తినా అది 'అత్యాచారం, హింస'నేరం కిందకే వస్తుందని అన్నారు. ప్రభుత్వ అధికారులు హింసకు గురైన బాలికల మీదనే బండరాయి వేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బాలికలను అగౌరవంగా మాట్లాడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గర్ల్స్ హాస్టళ్లలో అబ్బాయిలను పెట్టే వ్యవస్థ ఎందుకని ఆమె ప్రశ్నించారు. చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. పీవోసీఎస్‌వో చట్టం ప్రకారం ప్రభుత్వం వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

◆ **'మెడికల్ లీగల్ కేసు'నమోదు చేసే వరకు స్పందించలేదు..**

పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య మాట్లాడుతూ.. ఏడేళ్ల చిన్నారి మెచ్యూర్ అయిందని చెప్పి విషయాన్ని పక్కదారి పట్టించారని ఆరోపించారు. పాప అనారోగ్యంతో ఉంటే ఉన్నతాధికారులకు కూడా తెలియజేయలేదన్నారు. తెలిసిన తరువాత కూడా ఉన్నతాధికారులు ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం దారుణమన్నారు. పాప తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్తే పాపమీద ఏదో జరిగిందన్న విషయం వారికి తెలిసిందన్నారు. వైద్యులు వెంటనే 'మెడికల్ లీగల్ కేసు'నమోదు చేసే వరకు అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ జ్యోతి, అంబిక, కృష్ణకుమారి, కొండవీటి సత్యవతి, వరలక్ష్మి, ప్రొఫెసర్ పద్మషా, స్వరూప, అరుణ, ఉషారాణి, బండారు విజయ తదితరులు పాల్గొని ప్రసంగించారు.


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక వేత్త సజయ

మాదిగ అమరవీరుల నివాళి సభ 13న

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణ సాధనకు ప్రాణాలర్పించిన మాదిగ అమరవీరులకు వర్గీకరణ విజయాన్ని అంకితం ఇస్తూ ఈనెల 13న మాదిగ అమరవీరులకు నివాళి సభను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమరుల త్యాగాల వల్లనే ఉద్యమం పతాకస్థాయికి చేరిందన్నారు. వర్గీకరణ ఫలితాలు అనుభవించే ప్రతి కుటుంబం అమరులకు రుణపడి ఉంటుందన్నారు. నివాళి సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు బంగారు శ్రీనివాస్, చాప కృష్ణ, సంగనూరు వేణు, ఏదునూరి యాకన్న, రాజేష్‌ఖన్నా, పేర్ల మధు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీనివాస కల్యాణ హరికథ గానం

సాక్షి, సిటీబ్యూరో: చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంత రావు కళావేదికపై గద్వాల్ కాశీ విశ్వనాథ్ భాగవతార్ శ్రీనివాస కల్యాణం హరికథా గానం ఆసక్తికరంగా సాగింది. గాన సభ నిర్వహణలో తెలుగు జానపదం శాస్త్రీయ కళల వేదిక నిత్య వేడుక శీర్షిక శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. విష్ణువు భూమిపై వేంకటేశ్వరునిగా అవతరించి పర్వత రాజు కుమార్తె పద్మావతిని వివాహం చేసుకున్న ఘట్టాలను ఆసక్తికరంగా భాగవతార్ గానం చేశారు. తబలపై లక్ష్మీ ప్రసాద్, కీ బోర్డ్‌పై శేషు రాజు సహకరించారు. అనంతరం గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి భాగవతార్, వాయిద్య కళాకారులను సత్కరించారు.

నేటి నుంచి గాంధర్వం-2 జాతీయ సదస్సు

చిక్కడపల్లి: నవ్య నాటక సమితి 66వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10, 11వ తేదీల్లో 'గాంధర్వం–2 సాధనాత్ సాధ్యం'అనే శీర్షికతో జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త నిష్ఠల సుధామయి తెలిపారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లిలో ఆమె మాట్లాడుతూ.. ఓయులోని ఆంధ్ర మహిళా సభ ప్రాంగణంలోని టీచర్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పూర్వ సలహాదారు డా.కేవీ రమణాచారి, ఖజాన, మొక్కలు శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర, తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య ఆలేఖ్య పుంజాల, ప్రముఖ సంగీత విద్వాంసులు వి.ఆనందమోహన్, నర్తకి ఆనంద, రంజిత్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సులో దేశంలోని వివిధ యూనివర్సిటీల్లోని 60 మంది రీసెర్చ్ స్కాలర్లు పత్ర సమర్పణ చేస్తారని పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనే పత్ర సమర్పకులు వేద కాలంలో ఉన్న విషయాల నుంచి నవీన యుగం వరకు మార్పులు – చేర్పులు, సమాహార కళ గురించి సంగీత, నృత్యాల ద్వారా మానసిక రుగ్మతలను తొలగించడం వంటి అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సెమినార్ ఇన్‌చార్జి డా. ఇందిరాహేమ పాల్గొన్నారు.

గిరిజన ఆదివాసీలను ప్రభుత్వం ఆదుకోవాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

కాచిగూడ: ఆదివాసీ, గిరిజన హక్కులను సాధించే వరకు కేంద్ర ప్రభుత్వంపై పోరాడతామని... దీనికి గిరిజన సమాఖ్య సన్నద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్‌నగర్ ముగ్దుమ్ భవన్‌లో జరిగిన 'ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవ'కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. లంబాడా, చెంచు, కోయా, తదితర 33 తెగలు తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. వీరంతా గుట్టలు, చెట్లలో తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రహదారులు లేవనే నెపంతో చాలా గ్రామాలు, గిరిజన తండాలకు ఆర్‌టీసీ బస్సులు రాకపోవడం బాధాకరమని అన్నారు. వారికి కనీసం రేషన్‌కార్డు కూడా ఉండదన్నారు. రాష్ట్రంలోని గిరిజన ఆదివాసీలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వి.స్వరూప, కె.నారాయణ నాయక్, జె.శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

ముదిరాజ్ జాతి ప్రయోజనాలే లక్ష్యం

కాచిగూడ: రాష్ట్రంలో సుమారు 60 లక్షల మందితో అత్యధిక జనాభా కలిగి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడిన ముదిరాజ్ జాతి ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుదామని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ స్పష్టం చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లో తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాలలో ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ప్రజానీకం అత్యంత పేదరికంలో మగ్గుతూ జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సొసైటీ ద్వారా ప్రణాళికబద్ధంగా నిధులను విడుదల చేస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈటల భద్రన్న, జోరుక జగన్, పిట్ట నగేష్, బొజ్జ అనిల్ కుమార్, సురేష్, జనార్ధన్, సాయిరాం, రాజేశ్వర్, బొర్రన్న శ్రీకాంత్, గోపి తదితరులు పాల్గొన్నారు.


ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న డా. శంకర్

ఘనంగా హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

చిక్కడపల్లి: సేవా కార్యక్రమాలను నిర్వహించడమే తమ ప్రధాన ధ్యేయమని సుపర్‌స్టార్ కృష్ణ, మహేష్ సేన జాతీయ అధ్యక్షుడు దిడ్డి రాంబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీక్రాస్ రోడ్డులోని సుదర్శన్, దేవి థియేటర్లలలో సూపర్‌స్టార్ మహేష్‌బాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దిడ్డి రాంబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్నదానం, మొక్కలు నాటడం, రక్తదానం, ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశామన్నారు.

క్రాంతి దివస్ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న నారాయణగూడలోని మాడపాటి హనుమంతరావు హైస్కూల్ విద్యార్థులు

కాచిగూడ: ఆంగ్లేయులకు భారతీయ వాదాన్ని బలంగా తెలియజేసి దేశాన్ని విడిచి పారిపోయేలా చేసిన స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ లయన్ డా. సర్దార్ హర్‌బిందర్ సింగ్ పిలుపునిచ్చారు. క్రాంతి దివస్ (క్విట్ ఇండియా డే)ను పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణగూడ వైఎంసీఏ నుంచి కాచిగూడ వరకు మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవ్య కళానికేతన్ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ సంఘ సేవకులు లయన్ గోపిశెట్టి ప్రమోద్, స్కూల్ ప్రిన్సిపాల్ విజితారెడ్డి, సీజే అరుణ్‌కుమార్, టి.దుర్గామాల పాల్గొన్నారు.

నేడు ఎస్సీ హోదా సాధనకై దళిత క్రైస్తవుల బహిరంగ సభ

చిక్కడపల్లి: ఎస్సీ హోదా సాధనకై దళిత క్రైస్తవుల బహిరంగ సభను ఈనెల 9వ తేదీన ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్నట్లు ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏకే గిడియోను బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు వేలాదిగా దళిత క్రైస్తవులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, మాజీ ఐఏఎస్ అధికారి ఐ.శామ్యూల్, ఆనంద్‌కుమార్, ఓయూ ప్రొ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, అరుణోదయ సంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క తదితరులు పాల్గొంటారని తెలిపారు.

12 నుంచి వ్యాసరచన, పాటల పోటీలు

చిక్కడపల్లి: ఆగస్టు 12 అంతర్జాతీయ యువజన దినోత్సవం, 15న స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో వ్యాస రచన, పాటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు లయన్ డా. హిప్నో పద్మాకమలాకర్ తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా లయన్స్ స్వరూపారాణి, కృష్ణవేణి, శోభారాణి, జ్యోతిరాజా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. గెలుపొందే విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.93900 44031లో సంప్రదించాలని కోరారు.

కన్వర్టెడ్ క్రిస్టియన్స్‌కు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

నాగళ్ల పోచయ్య ఇజ్రాయల్

కాచిగూడ: అన్ని రంగాల్లో వెనుకబడిన కన్వర్టెడ్ క్రిస్టియన్స్ (బీసీ–సీ)కి తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని అణగారిన క్రైస్తవ జన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు నాగళ్ల పోచయ్య ఇజ్రాయల్ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ–సీలకు ప్రత్యేకమైన కమిషన్‌తో పాటు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. బీసీ–సీలకు అసెంబ్లీల వారీగా నియోజకవర్గాలను కేటాయించాలన్నారు. కన్వర్టెడ్ క్రిస్టియన్ల అందరికీ బీసీ–సీ సర్టిఫికెట్స్‌ను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన శనివారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 'కన్వర్టెడ్ క్రిస్టియన్స్ ఫెస్టివల్ డే'ను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ–సీలు రాజకీయాల్లో రాణించే విధంగా పార్టీలు, ప్రభుత్వాలు చేయూతను ఇవ్వాలని కోరారు.

బస్తీదవాఖానాలో తమిళనాడు వైద్యులు

కాచిగూడ: ముత్యాలబాగ్ బస్తీ దవాఖానాను శుక్రవారం తమిళనాడు వైద్య అధికారుల బృందం సందర్శించింది. బస్తీ దవాఖానాలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను వైద్యాధికారి డా. శ్రీస్మృతి వారికి వివరించారు. ముఖ్యంగా డిజిటల్ సర్వీసెస్, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య మహిళ, ఓపీ కన్సల్టేషన్, తెలంగాణ డయాగ్నాస్టిక్ సర్వీస్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిబాబా, డాక్టర్ రుక్మారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

అంబర్‌పేట: ఆధ్యాత్మిక మార్గం మానసిక ప్రశాంతతను ఇస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గోల్నాకలోని ది హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి 32వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...చర్చి ప్రతినిధులు పేదలకు చేయూతనివ్వడం అభినందనీయం అన్నారు. అనంతరం చర్చ్ ప్రసిడెంట్, పాస్టర్ అబ్రహాంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్‌లు మధు, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని అరోరా కాలేజీ పక్క వీధిలో రూ.30లక్షల నిధులతో కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి వాటర్ పైపులైన్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు ముఠా జైసింహ, బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, మన్నె దామోదర్‌రెడ్డి, కూరగాయల శ్రీనివాస్, నాగభూషణం, జనార్దన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కదులుతున్న రైలు నుంచి దిగబోయి మహిళ మృతి



కాచిగూడ: కదులుతున్న ఎంఎంటీఎస్ రైలు నుంచి దిగబోయిన ఓ మహిళ (35) మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 3న గుర్తుతెలియని మహిళ కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం–2పై కదులుతున్న ఎంఎంటీఎస్ రైలులో నుంచి దిగబోయి కిందపడింది. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



రైలు ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం... మలక్‌పేట – కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (35) పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

కేంద్ర ప్రభుత్వానివి కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు

కాచిగూడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని కార్మిక సంఘాల నేతలు ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణగూడలో కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త కిసాన్ మోర్చా నేతలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్‌డీ చంద్రశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ప్రధానకార్యదర్శి ఎస్.బాల్‌రాజు, సంయుక్త కిసాన్ మోర్చా నేతలు పశ్య పద్మ, సాగర్ తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్లు, ఆదానీ, అంబానీ ఆస్తులను పెంచే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ప్రజా, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను పునర్ సమీక్షించి ప్రజల బడ్జెట్‌గా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత విస్తరించి 14రకాల నిత్యావసరాలు ఇవ్వాలన్నారు. ప్రవీణ్‌కుమార్, వెంకటరాములు, శంకర్, వెంకటేష్ పాల్గొన్నారు.